క్లుప్తంగా

పీజీఆర్ఎస్‌కు 14 అర్జీలు

జంగారెడ్డిగూడెం: ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో ఎంవీ రమణ అధ్యక్షన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజల సమస్యలను తీర్చే క్రమంలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ (మీకోసం) కార్యక్రమంలో వచ్చే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తి స్థాయి పరిష్కారం చూపించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 14 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. వీరిలో భూ సమస్యలు, ఆర్అండ్ఆర్, పెన్షన్లకు సంబంధించిన అర్జీలు వచ్చాయన్నారు.

'దేవరకొండ పోలీస్ స్టేషన్' రీ రిలీజ్‌కు సన్నాహాలు



సమావేశంలో మాట్లాడుతున్న దర్శకుడు కాళీ చరణ్

జంగారెడ్డిగూడెం: ప్రముఖ హీరో సుమన్ ముఖ్య పాత్రలో నిర్మించిన దేవరకొండ పోలీస్ స్టేషన్ చిత్రాన్ని రీరిలీజ్ చేస్తున్నట్లు దర్శకుడు కాళీ చరణ్ సోమవారం విలేకరులకు తెలిపారు. సమాజంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, మాదక ద్రవ్యాల వాడకం యువతపై ఏ విధంగా ప్రభావం చూపుతుందో తెలియజెప్పే అంశంతో చిత్రం రూపొందినట్లు చెప్పారు. చిత్రాన్ని మే నెల రెండో వారంలో రీరిలీజ్ చేస్తున్నామన్నారు. చిత్రంలో జంగారెడ్డిగూడేనికి చెందిన సినీ నటులు, అంబికా హోటల్స్ అధినేత ఉక్కుర్తి దుర్గారావు విలన్‌గా నటించారని దర్శకుడు తెలిపారు.

గోనె సంచులు లేక రైతుల అవస్థలు

భీమడోలు: మండలంలోని గుండుగొలనులో రైతులకు గోనె సంచులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని భీమడోలు ఏఎంసీ మాజీ చైర్మన్ వగ్వాల భాస్కర్ జిల్లా ఇంచార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజులకు ఫిర్యాదు చేశారు. గత మూడు రోజులుగా రైతులకు గోనె సంచులు అందజేయకపోవడంతో ధాన్యం సేకరణకు ఆటంకంగా మారిందన్నారు. ఓ పక్క వాతావరణం ఆందోళన కలిగిస్తుందన్నారు. ధాన్యం ఎక్కడబడితే అక్కడ రోడ్లపై ఉందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గోనె సంచులు పంపిణీ చేయాలని, ధాన్యం త్వరితగతిన సేకరించాలని ఆయన కోరారు.

22న మండల సర్వసభ్య సమావేశం

దెందులూరు: దెందులూరు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 22 మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ఎంపీపీ బొమ్మన బోయిన సుమలత అధ్యక్షత వహిస్తారని ఎంపీడీవో కె.శ్రీదేవి తెలిపారు. మండలంలో ఎంపీటీసీలందరూ అన్ని శాఖల మండల అధికారులు విధిగా సమావేశానికి పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

ఉంగుటూరు: మండలంలోని గోపీనాథ పట్టణంలో శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్ల దివ్య విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మూడో రోజు సోమవారం గణపతిపూజ, గోపూజ, మంత్రానుష్టానము, ఏకాదశ రుద్రాభిషేకం, తీర్థప్రసాద వినయోగ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి బింబ సంస్కార హోమాలు, పర్యాయ హోమాలు, మహామృత్యుంజయ హోమం, రుద్రహోమం, శివపరివార దేవతా హోమం, క్షీరాధివాస హోమం, క్షీరాధివాసము, నీరాజన మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, సాధని కుమారిల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి.

విద్యార్థులు వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

దెందులూరు: వేసవిలో పాఠశాల విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ గోవిందరావు అన్నారు. సోమవారం గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రోజా ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు అవగాహన సమావేశం జరిగింది. గోవిందరావు మాట్లాడుతూ దూర ప్రాంతాలు ప్రయాణించడం వల్ల, శరీరం నుంచి నీరు చెమట రూపంలో బయటకు పోతుందన్నారు. ఇలాంటి సమయాల్లో వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. చిన్న పిల్లలు, విద్యార్థులు, గర్భిణులు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అధిక వేడిలో పనిచేయవద్దని కాటన్ దుస్తులు ధరించాలని, తలపాగా, టోపీ, గొడుగు, ఎక్కువగా ద్రవపదార్థాలు తీసుకోవాలని, ఎండ ప్రాంతాల్లో పనులు చేయకూడదని ఆయన సూచించారు. ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే !

- దుర్వాసన భరించలేకపోతున్నామని ప్రజల ఆవేదన
- దోమలతో సహవాసం.. ప్రబలుతున్న రోగాలు
- కాలుష్యపు కోరల్లో పాతాళకుంట కాలువ
- అధికారులు ప్రక్షాళన చర్యలు చేపట్టాలని కోరుతున్న గ్రామస్తులు



మురుగు నీటితో నిండిపోయిన పాతాళకుంట కాలువ



పాతాళకుంట కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

లింగపాలెం: ధర్మాజీగూడెంలో ఇళ్ల మధ్యలో ఉన్న పాతాళకుంటలో మురుగునీరు నిల్వ ఉండి ఒక వైపు దుర్వాసన మరో వైపు దోమల మయంతో భరించలేకపోతున్నామంటూ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే కాలువ పొంగి ఇళ్లలోకి నీరు వచ్చేస్తుంది. వర్షపు నీటితో పాటు మురుగు నీరు కూడా బయటకు పోయే మార్గం లేదు. ఈ కాలువ ఒక వైపు గుర్రపుడెక్కతోనూ, మరో వైపు పూడికతో నిండి ఉంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం మధ్యలో ఉన్నా ఈ పాతాళకుంట కాలువ ద్వారా నీరు ఎర్ర చెరువులోకి వెళుతుంది. అనేక పర్యాయాలు పంచాయతీ వారు ఈ కాలువలో పూడిక తీశారు. అయినా ఈ కాలువ తరుచూ పూడికతో నిండి నీరు నిల్వ ఉంటుంది. ఇది గుర్రపుడెక్కతో పూర్తిగా అలుముకొని ఉంది. దీనికి తోడు ఇళ్లలో వాడకం నీరు చేరి దోమలతో పాటు తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో కాలువ పొంగి ఆ నీరు సుమారు 200 ఇళ్లను ముంచెత్తుతుంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరి కష్టాలు వర్ణనాతీతం.

తరచూ ప్రజా ప్రతినిధుల పర్యటన

గతంలో ఈ కాలువను మరమ్మతులు చెపట్టేందుకు అనేక సార్లు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యటిస్తున్నారే తప్పా ఇంత వరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ పనులకు సుమారు రూ.25 లక్షల వరకు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. అయినా ఫలితం మాత్రం శూన్యం. కాలువకు ఇరువైపులా గోడలు నిర్మించి, అడుగు భాగంలో ఫ్లోరింగ్ చేయించి వర్షాకాలంలో కాలువలోని నీరు ఇళ్లను ముంచెత్తకుండా చూడాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. ఈ గ్రామానికి చెందిన వ్యక్తే ఎమ్మెల్యే కావడతంతో ఇప్పుడైనా ఏళ్ల తరబడి ఉన్న సమస్యకు మోక్షం లభిస్తుందేమోనని ఈ ప్రాంత ప్రజలు అతృతగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా సంబధిత అధికారులు ఈ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ చూపి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రివిట్‌మెంట్ నిర్మించాలి



పంచాయతీ వారు పూడిక తీస్తున్నప్పటికీ తరుచూ పాతాళకుంట కాలువ పూడిపోకుండా శాశ్వతంగా అడుగు భాగంలో సిమెంట్ చేసి, సైడ్ గోడలకు రివిట్‌మెంట్ కట్టాలి. కాలువలో నుంచి నీరు బయటకు వెళ్లకపోవటంతో దోమలతో పాటు తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. అంటువ్యాధులు ప్రబలుతాయోనని బయపడుతున్నాం. పూర్తి స్థాయిలో కాలువ పనులకు ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

–ఎస్.శ్రీను, ధర్మాజీగూడెం

అటకెక్కిన రహదారి విస్తరణ పనులు

- శ్రీవారి క్షేత్రంలో ట్రాఫిక్ సమస్యకు ఇదే కారణం
- పాలకులు, అధికారుల తీరుపై మండిపడుతున్న భక్తులు
- అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన



ద్వారకాతిరుమల గుడి సెంటర్‌లో స్తంభించిన ట్రాఫిక్



బైపాస్ రోడ్డులో వన్‌వే నిబంధనలు అమలు కాకపోవడంతో నిలిచిపోయిన వాహనాలు

ద్వారకాతిరుమల: భీమడోలు–ద్వారకాతిరుమల ప్రధాన రహదారి విస్తరణ పనులు ప్రారంభించి పుష్కరం కావొస్తున్నా ఇప్పటి వరకు క్షేత్రంలోని ప్రధాన కూడలిలో ఈ పనులు పూర్తి కాలేదు. ఇరుకు రోడ్ల కారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పాలకులు, అధికారులు అదిగో.. ఇదిగో అనడంతోనే సరిపోతుంది. వివరాల్లోకి వెళితే.. పదేళ్ల క్రితం నిర్వహించిన గోదావరి పుష్కరాల సమయంలో పుష్కర నిధులు రూ.50 కోట్లతో భీమడోలు–ద్వారకాతిరుమల రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించారు. సుమారు 17 కిలో మీటర్ల మేర ఈ పనులు చేశారు. అయితే క్షేత్రంలోని గుడి సెంటర్‌లో కొందరు వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించి, స్టేలు పొందడంతో ఈ ప్రాంతంలో విస్తరణ పనులకు బ్రేక్ పడింది. ప్రస్తుతం కోర్టులో ఆ స్టేలు తొలగిపోయాయి. అయినా పనులు ముందుకు కదలడం లేదు.

హడావుడి చేయడంతోనే సరి

విస్తరణ పనులు పూర్తి చేస్తామని ఇటీవల సంబంధిత అధికారులు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు గుడి సెంటర్‌ను పరిశీలించారు. సిబ్బంది కొలతలు కూడా వేశారు. ఇంకే ముంది పనులు పూర్తి చేస్తారని అంతా అనుకున్నారు. అయితే ఆ పనులు మళ్లీ అటకెక్కినట్టుగా కనిపిస్తున్నాయి. ఇప్పుడు విస్తరణ ఊసే ఎవరూ ఎత్తడం లేదు. అది ఎందుకనేది ఆ చిన వెంకన్నకే తెలియాలి. గోదావరి పుష్కరాలు వస్తే విస్తరణ పనులు ప్రారంభమై 12 ఏళ్లు పూర్తవుతుంది.

అవసరం మేరకు చేస్తే..

రోడ్డు నిర్మాణానికి అవసరమైన మేరకు విస్తరణ చేస్తే వ్యాపారులకు ఏ విధమైన ఇబ్బంది ఉండదు. అలా కాదని ఆర్అండ్‌బీ స్థలం ఎంత వరకు ఉంటే అంత వరకు కట్టడాలను తొలగిస్తామంటే మాత్రం వ్యాపారులకు కష్టనష్టాలు తప్పవనే చెప్పాలి. అయితే విస్తరణ పనులు చేపట్టాలంటున్నారు.

రద్దీ సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు

క్షేత్రంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు, వివాహాల సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. గుడి సెంటర్‌లో దుకాణాలు రోడ్డు మీదకు రావడం ఈ సమస్యకు ఒక కారణం. బైపాస్ రోడ్డులో వన్‌వే నిబంధనలు అమలు కావడం లేదు. దీంతో ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. మెయిన్ సెంటర్ విస్తరణ పనులు పూర్తయితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని స్థానికులు అంటున్నారు.

విభిన్న ప్రతిభావంతులకు పరికరాల అందజేత



విభిన్న ప్రతిభావంతులకు వీల్‌చైర్లు అందజేస్తున్న కౌన్సిలర్

జంగారెడ్డిగూడెం: విభిన్న ప్రతిభావంతులకు పరికరాలు అందజేసే కార్యక్రమం స్థానిక 4వ వార్డు ఇందిరానగర్ కాలనీ భవిత స్కూల్‌లో నిర్వహించారు. స్కూల్ టీచర్ జి.రజని అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వం నుంచి 18 పరికరాలను విభిన్న ప్రతిభావంతులకు కౌన్సిలర్ వలవల తాతాజీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వలవల తాతాజీ మాట్లాడుతూ 28 మంది లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వానికి నివేదించగా, వారిలో 11 మందికి 18 పరికరాలు (ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు) వచ్చాయన్నారు. వీటిని సోమవారం వారికి అందజేశామన్నారు. కాగా భవిత సెంటర్‌లో ప్రతి సోమవారం ఫిజియో థెరపిస్ట్ నీలిమ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ చేస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు నాగబాబు, శ్యామల, అంగన్‌వాడీ టీచర్ బేబీ రత్నం, భవిత స్కూల్ సిబ్బంది, ఇందిర, మణి పాల్గొన్నారు.

మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు

చింతలపూడి: మే 10వ తేదీన నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు విజ్ఞప్తి చేశారు. స్థానిక కోర్టు ఆవరణలో సోమవారం న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులు పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. మెగా లోక్ అదాలత్‌లో క్రిమినల్ సివిల్, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదాలు, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి రోజూ ఫ్రీ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మాణిక్యాలరావు , న్యాయవాదులు, కోర్టు సూపరింటెండెంట్ పి.గురవయ్య నాయుడు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని ధర్నా



ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పని బకాయిలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. యాగంటి సీతా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం మాట్లాడుతూ పట్టెనపాలెంలో చెరువు పనులు పెట్టకుండా హార్టికల్చర్ పనులు పెడుతున్నారని అక్కడ ఫీల్డ్ అసిస్టెంట్ ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. అనంతరం వినతి పత్రాన్ని కార్యాలయ సూపరింటెండెంట్ గోపాలకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో జోడి సూర్యచంద్రం, అందుగుల ప్రభాకరరావు, వామిశెట్టి నరసారావు, కె.సుబ్బారావు, పి.పోతురాజు, వి.అనుమకుమారి, కె.దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

శంకరరావు సేవలు అభినందనీయం



సన్మాన సభలో పాల్గొన్న అధ్యాపకులు

టి.నరసాపురం: అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శంకరరావు సేవలు అభినందనీయమని ఏపీ గురుకుల విద్యాలయాల రిటైర్డ్ రీజనల్ డిప్యూటీ సెక్రటరీ డి.చినవెంగయ్య అన్నారు. అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాలలో శంకరరావు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న డీఎస్‌బీ శంకరరావు ఉద్యోగ విరమణ చేస్తున్నారన్నారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని, ఈ సంవత్సరం కూడా నూరుశాతం ఉత్తీర్ణత సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. శంకరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్స్ రామచంద్రరావు, రాజేంద్రప్రసాద్, నరేష్, పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, రామారావు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

అక్కమ్మ కోనేరు పనుల పరిశీలన



అక్కమ్మ కోనేరు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: అక్కమ్మ కోనేరు పనులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పర్యవేక్షించారు. కోనేరు పరిసర ప్రాంతాలను పరిశీలించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని గుత్తేదారుడికి సూచించారు. ఈ సందర్భంగా బత్తిన లక్ష్మి మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్రజలకు, చిన్నారులకు అన్ని వయసుల వారికి సేద తీరేందుకు వీలుగా అక్కమ్మ కోనేరును అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. సుమారు రూ.4 కోట్లతో కోనేరును అభివృద్ధి చేసేందుకు పనులు చేపట్టామన్నారు. కోనేరు చుట్టూ వాకింగ్ ట్రాక్, చిన్నారులు ఆడుకునేందుకు క్రీడా సామగ్రిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే బోటింగ్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ, ఏఈ రాజేష్, 27వ వార్డు కౌన్సిలర్ నేట్రు సుబ్బలక్ష్మి, నాయకులు బత్తిన చిన్న, నేట్రు గణేష్, పెసరగంటి త్రిమూర్తులు, కంచుమర్తి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం: పట్టణ పరిధిలో 10వ వార్డు సచివాలయ సమీపంలో ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించారని, దీనిపై చర్యలు తీసుకోవాలని 20వ వార్డు కౌన్సిలర్ నేట్రు సుబ్బలక్ష్మి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మున్సిపల్ కమిషనర్ కేవీ రమణకు ఫిర్యాదు చేశారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తూ ప్రభుత్వానికి చెందిన భూమిని ప్రజా అవసరాల కోసం వినియోగించాలని కోరారు. దీనిపై కమిషనర్ రమణ మాట్లాడుతూ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వేడుకగా ధ్వజారోహణ



ఆలయ యాగశాలలో పూజలు చేస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీసంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజారోహణ వేడుక సోమవారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రీనివాసుని దివ్య కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఈ వేడుకను భక్తుల గోవింద నామస్మరణలతో అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో కల్యాణ మూర్తులకు అర్చకులు విశేష పూజలు జరిపారు. రాత్రి ధ్వజారోహణ కార్యక్రమం నిమిత్తం యాగశాలలో ధ్వజ పటంపై గరుత్మంతుని చిత్ర పటాన్ని అర్చకులు, పండితులు వేద మంత్రోచ్ఛరణలతో లిఖించారు. పూజలు, హోమాది కార్యక్రమాల అనంతరం మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ధ్వజపటానికి హారతులిచ్చి, దానిని ధ్వజ స్తంభంపై ఎగురవేశారు. ఈ వేడుకల్లో ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక వంతెనపై రాకపోకలు బంద్



వంతెనపై మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

భీమడోలు: గుండుగొలను గోదావరి కాల్వపై నిర్మించిన తాత్కాలిక వంతెన నిర్మాణ పనులు మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా దారి మళ్లించారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు మినహా ఇతర వాహనాలు ప్రత్నామ్యాయ మార్గాల్లో రాకపోకలు సాగించేలా తగు ఏర్పాట్లు చేశారు. భారీ వాహనాలు వంతెనపై వెళ్లకుండా బంద్ చేశారు. ఇప్పటికే వంతెన శిథిలావస్థకు చేరడంతో కూలేందుకు సిద్ధంగా ఉంది. ఆర్అండ్‌బీ శాఖకు నిధుల కొరత ఉన్నందున పంచాయతీ ఆ పనులు చేపట్టేందుకు అంగీకరించింది. దీనితో పనులు ప్రారంభమయ్యాయి. జాతీయ రహదారి గుండుగొలను వద్ద గల వంతెనపై స్కూలు బస్, లారీలు, వ్యాన్‌లు ఎట్టి పరిస్థితుల్లోను రాకపోకలు సాగించకుండా అడ్డుగా భారికేడ్లును ఏర్పాటు చేశారు. తాత్కాలిక వంతెన తుప్పు పట్టి, భారీ రంధ్రాలు పడడంతో ఈ వంతెనకు మరమ్మతులు పనులు చేపడుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నరసాపురం: బొర్రంపాలెం సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 22వ తేదీ మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. కావున సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రాజశేఖర్, ఎస్సై కుటుంబరావు

చింతలపూడి: వాహనదారులు హెల్మెట్ ధరించడం వలన ప్రాణ రక్షణ కలుగుతుందని సీఐ సీహెచ్ రాజశేఖర్ అన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థులకు, వాహనదారులకు హెల్మెట్ ధారణ వలన కలిగే ఉపయోగాలు, ట్రాఫిక్ నిబంధనలను గురించి ఎస్సై కుటుంబరావుతో కలిసి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. అదే విధంగా వాహనదారులు సంబంధిత ధ్రువ పత్రాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వాహనదారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులు

కొయ్యలగూడెం: కుంతలగూడెం ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. పిల్లలు నృత్యాలతో అలరించారు. ఆహుతులను తమ అభినయంతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాయపూడి వెంకటరమణ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు నిండిన బాల బాలికలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మిరియాల విజయ్, డి.శ్రీనివాసరావులను ఘనంగా సన్మానించారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి



జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు

కొయ్యలగూడెం: బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలాల ప్రజలు కోరారు. ఈ మేరకు సోమవారం జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కొయ్యలగూడెం మండలం నరసన్నపాలెం నుంచి రామానుజపురం, వేదాంతపురం చెరువుగట్టు మీదుగా ధర్మారావుపేట, కోయరాజమండ్రి, రాయిగూడెం, కమ్మరబొత్తప్పగూడెం, నిమ్మలగూడెం, పోలవరం వరకు గతంలో బస్సు సర్వీసు ఉండేదన్నారు. అయితే ప్రస్తుతం ఆ సర్వీసును నిలుపుదల చేయడంతో చదువుకునే పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ఈ గ్రామాల ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని, బస్సు సర్వీసును పునరుద్ధరించాలని వారు కోరారు. కార్యక్రమంలో బాలం నరేష్, బలరామ రాజు, సింహాద్రి రాజు, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



వాసుబాబును సత్కరిస్తున్న బండారు నాగరాజు

ఉంగుటూరు : వైఎస్సార్‌సీపీ కేంద్ర కమిటీ సభ్యుడు పుప్పాల వాసు బాబును ఉంగుటూరు మండల ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.